క్లుప్తంగా

27న గౌడ ఎడ్యుకేషనల్ అవార్డుల ప్రదానం



మాట్లాడుతున్న జెర్రిపోతుల ప్రసాద్

డాబాగార్డెన్స్ : విశాఖ జిల్లా గౌడ సంఘం ప్రతి ఏటా జరుపుకునే వార్షికోత్సవంలో భాగంగా ఈ నెల 27న గౌడ ఎడ్యుకేషనల్ అవార్డులు, వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నట్టు సంఘం గౌరవ అధ్యక్షుడు జెర్రిపోతుల ప్రసాద్, అధ్యక్షుడు మార్గాన రామారావు తెలిపారు. శుక్రవారం కాన్వెంట్ జంక్షన్ సమీపాన గల గౌడ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంఘ కార్యాలయంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చేతుల మీదుగా గౌడ విద్యార్థులకు అవార్డులు అందజేయనున్నట్టు చెప్పారు. అనంతరం వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని గౌడ విద్యార్థులు, పరిచయ వేదికను గౌడ సంఘీయులు వినియోగించుకోవాలని కోరారు. సమా వేశంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ కామన వెంకట సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ సుందరరావు, కొయ్యల సత్యనారాయణ, నిచ్చనకోళ్ల వెంకట్రావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డాబాగార్డెన్స్ : మరమ్మతుల కారణంగా 11 కేవీ విద్యుత్ హెచ్‌టీ లైన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి. సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అల్లిపురం, నేరెళ్లకోనేరు, అమ్మవారి వీధి, కర్బాలవీధి, పోలీస్ క్వార్టర్స్, అల్లిపురం బజార్, రైల్వేస్టేషన్ రోడ్డు, అల్లిపురం సిగ్నల్ పాయింట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

టోల్‌గేటు తొలగించాలని వినతి

అల్లిపురం : అగనంపూడి టోల్ గేటును తక్షణమే తొలగించాలని కోరుతూ సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మెయిల్ ద్వారా కలెక్టర్‌కు, జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం పంపారు. కాలపరిమితి ముగిసిన టోల్ గేటును తొలగించకుండా ప్రజల నుంచి, వాహన చోదకుల నుంచి టోల్ ఫీజు వసూ లు చేస్తూ దోపిడీకి పాల్పడుతుందన్నారు. ఆనందపురం, సబ్బవరం, అనకాపల్లి ఆరులైన్ల రోడ్డు నిర్మాణం పూర్తి అయిన వెంటనే అగనంపూడి టోల్‌గేట్ తొలగిస్తామని సుప్రీం కోర్టుకు నేషనల్ హైవే అధికారులు తెలిపారన్నారు. అయితే అలా జరగలేదన్నారు. జీవీఎంసీ పరిధిలో టోల్‌గేట్ ఉండకూడదని, ఏడాది క్రితమే జీవీఎంసీ దీనిని ఏకగ్రీవంగా తీర్మానించిందని గుర్తు చేశారు. తక్షణమే టోల్‌గేట్ తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఆయన వినతిపత్రంలో కోరారు.

రైల్వే టీటీఈకి అభినందన

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్, కమర్షియల్ విభాగంలో ట్రెన్ టికెట్ ఎగ్జామినర్(టీటీఈ)గా విధులు నిర్వర్తిస్తున్న డి.ఆర్.ఎం.రెడ్డి నిజాయితీని పలువురు ప్రశంసించారు. రైల్లో ఓ ప్రయాణికుడు మరచిపోయిన బంగారు ఉంగరాన్ని తిరిగి అతడికి ఆయన అందజేసి నిబద్ధత చాటారు. వివరాలిలా.. శివ కరణం అనే ప్రయాణికుడు ఈ నెల 23న బెంగళూరు–హౌరా రైలు థర్డ్ ఏసీ కోచ్‌లో తిరుపతిలో బయలుదేరి 24న విశాఖకు చేరుకున్నాడు. ఇక్కడ గురువారం ఉదయం తన కుటుంబంతో కలిసి రైలు దిగిపోయాడు. కొద్దిసేపటికి తన గోల్డ్ రింగ్ రైలులో పోగొట్టుకున్నట్టు అతడు గుర్తించి టీటీఈకి సమాచారం అందించాడు. వెంటనే స్పందించిన ఆయన బెంగళూరు–హౌరా రైలులో విధి నిర్వహణలో ఉన్న టీటీఈ డి.ఆర్.ఎం.రెడ్డికి సమాచారం చేరవేశారు. ఈయన తక్షణం శివ ప్రయాణించిన బెర్త్ వద్దకు వెళ్లి తనిఖీ చేసి ఉంగరాన్ని కనుగొన్నారు. వెంటనే ఆ ప్రయాణికుడికి దాన్ని అందజేశారు. సుమారు రూ.35 వేల విలువైన తన గోల్డ్ రింగ్ తిరిగి దొరకడంతో శివ సంతోషం వ్యక్తం చేశాడు. డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి టీటీఈ రెడ్డికి అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ పాలన.. ప్రజల మన్నన

ఆధార్.. చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు ఇది ఎంతో ముఖ్యం. ఆధార్ కార్డును ఇప్పుడు అన్ని రకాల సేవలకు అనుసంధానం చేయటం వల్ల ఒక్క ఆధార్‌ను పరిశీలిస్తే సమస్త వివరాలు తెలుసుకోవచ్చు. అంతటి ముఖ్యమైన ఆధార్‌లో ఏ చిన్న పొరపాటు ఉన్నా లబ్ధిదారు తీవ్రంగా నష్టపోక తప్పదు. దీనిని దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక ఆధార్ అప్‌డేట్ క్యాంపులు నిర్వహించి ముఖ్యమైన సేవలందించింది.

- జోన్–4లో లబ్ధి పొందిన 20 వేల మంది ఆధార్ కార్డుదారులు
- విజయవంతంగా ముగిసిన ఆధార్ అప్‌డేట్ ప్రత్యేక క్యాంపులు
- ప్రజల ముంగిటకే ప్రభుత్వం అంటే ఇదేనని లబ్ధిదారుల హర్షం



వెలంపేట సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ చేయించుకుంటున్న కార్డుదారులు

జగదాంబ : అన్నింటికీ ఆధారం ఆధార్. ఇది లేనిదే ఇప్పుడు ఏ పనీ జరగటంలేదు. ఉద్యోగాలకు అప్లై చేయాలన్నా, పాఠశాలలు, కళాశాలల్లో చేరాలన్నా, బ్యాంకులకు దరఖాస్తు చేసుకోవాలన్నా, మరీ ముఖ్యంగా ప్రభుత్వం అందజేసే సంక్షేమ ఫలాలు అందాలన్నా ఆధార్ ఎంతో ముఖ్యం. అటువంటి ఆధార్‌లో తప్పులు దొర్లితే.. ఇంకేముంది అనుకున్న పనులేవీ పూర్తి కావు. రోజులు వారాలు తిరిగినా ఫలితం ఉండదు. ఈ సమస్యను గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల సౌలభ్యం కోసం ఆధార్‌లో మార్పులు, చేర్పుల కోసం ఆధార్ అప్‌డేట్ క్యాంపులు నిర్వహిస్తోంది. కేవలం ఆధార్‌లో పొరపాట్ల వల్ల అసలైన లబ్ధిదారులు ఎవరూ నష్టపోకూడదని ఈ క్యాంపులు నిర్వహిస్తూ అందరూ లబ్ధి పొందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంది. సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహించి అందరి ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసింది.

గతంలో ఉరుకులు.. పరుగులు..

గతంలో ఆధార్ కార్డులో ఏ చిన్న పొరపాటు ఉన్నా ఆన్‌లైన్, ఆధార్ కేంద్రం, నెట్ సెంటర్ల చుట్టూ జనాన్ని పరుగులు పెట్టించేవారు. తీరా అక్కడికి వెళితే చాంతాడంతా క్యూ ఉండేది. తెల్లారి వెళితే ఏ రాత్రికో ఇంటికి తిరిగి వెళ్లాల్సి వచ్చేది. ఇదంతా నిశితంగా గమనించిన జగనన్న ప్రభుత్వం ప్రజల బాధను అర్థం చేసుకుంది. సచివాలయాల్లో ఆధార్ తప్పులను సరి చేసుకునే అవకాశం ప్రజలకు కల్పించింది. ఇంటికి కూతవేటు దూరంలో రద్దీ.. రణగొణ ధ్వనులు, గోల వంటి ఇబ్బందులు లేకుండా చక్కగా ఆధార్‌లో మార్పులు, చేర్పులు చేసుకునే వీలు కల్పించింది. నియోజకవర్గ పరిధిలోని వార్డుల్లో ఉన్న అన్ని సచివాలయాల్లో ఈ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈనెల 22న ప్రారంభమైన ఈ ప్రత్యేక ఆధార్ క్యాంపులు నాలుగు రోజులు జరిగాయి. ఈ క్యాంపుల్లో ప్రజలు తమతమ ఆధార్ కార్డుల్లో దొర్లిన తప్పులను సరి చేసుకున్నారు. ఇంటి పేర్లు, చిరునామా వంటి వాటిలో పొరపాట్లు ఉంటే మార్చుకున్నారు. అలాగే ఇప్పటి వరకు అసలు ఆధార్ కార్డే లేనివారు కూడా కొత్తగా ఆధార్ కార్డు కోసం తమ పేర్లు నమోదు చేసుకున్నారు. సంక్షేమ పాలనకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిన్నచిన్న పొరపాట్ల వల్ల ఏ లబ్ధిదారు నష్టపోకూడదని తీసుకుంటున్న జాగ్రత్తల్లో సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక క్యాంపులు ఒక ఉదాహరణగా నిలిచాయని లబ్ధిదారులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జోన్–4 పరిధిలో..

జీవీఎంసీ జోన్–4 పరిధిలో ఉన్న 12 వార్డుల్లోని 68 సచివాలయాల్లో ఆధార్ అప్‌డేట్ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 20 వేల మందికి పైగా ఆధార్ లబ్ధిదారులు సేవలు పొందారు. పేర్లు, చిరునామాలు, వయసులో తేడాలను సరైన ఆధారాలు చూపించి సవరింపజేసుకున్నారు. గతంలో ఆధార్ లో సవరణలకు ఎక్కడెక్కడికో వెళ్లాల్సి వచ్చేదని.. జగనన్న ప్రభుత్వం తమ బాధలను గుర్తించి తమ ముంగిటకే అన్ని సౌకర్యాలు తీసుకొస్తుందని ఈ సందర్భంగా ప్రజలు ప్రభుత్వాన్ని కొనియాడారు.

తిరగనవసరం లేకుండా పని జరిగింది..



చదువు లేని మాలాంటి వారు ఏ పని చేయించుకోవాలన్నా నానా ఇబ్బందులు పడేవాళ్లం. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి ఏ పని ఎక్కడ చేస్తారు.. ఏ కాగితాలు అందజేయాలి.. ఎవరి సంతకాలు చేయించుకోవాలి అనే విషయాలు తెలియక.. చెప్పే నాథుడు లేక అవస్థలు పడేవాళ్లం. ఎవరినైనా అడిగినా వారు కసురుకునే వారు. ఇప్పుడు జగనన్న ప్రభుత్వం మా ఇంటి ముంగిటకే ఆధార్‌లో తప్పు లు సరిదిద్దుకునే కార్యక్రమం తీసుకొచ్చి మా కష్టం తీర్చింది. ఆధార్ కార్డే కాదు అన్ని ప్రభుత్వ పథకాలు, రేషన్, ధ్రువపత్రాలు ఇంటికే వచ్చేస్తున్నాయి.

– డి.అప్పలసూరి, ఆధార్ కార్డుదారు, ప్రసాద్‌గార్డెన్స్

ఆధార్ కార్డు సమస్య పరిష్కారం అయింది..



ఆధార్ కేంద్రాల్లో ఆన్‌లైన్ అప్‌డేట్ చేసుకోవటం ఎలాగో తెలియకే ఇన్నాళ్లు ఆగిపోయాం. ఇప్పుడు ప్రభుత్వం సచివాలయల్లో స్పెషల్ ఆధార్ అప్‌డేట్ కార్యక్రమం పెట్టి మాలాంటి వారిని ఆదుకుంది. ఎప్పటి నుంచో పరిష్కారం కాని ఆధార్ కార్డు సమస్యను ఇక్కడికి వచ్చి పరిష్కరింపజేసుకున్నాం.

– విత్తనాల మంగ, ఆధార్ కార్డుదారు, వెలంపేట, 35వ వార్డు.

సచివాలయాల్లో యథావిధిగా..



ఈనెల 22 నుంచి 25 వరకు సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక క్యాంపులో కార్డుదారులు తమ పేర్లు, చిరునామాలు, ఇతర పొరపాట్లను కరెక్షన్ చేయించుకున్నారు. సచివాలయాల్లో రోజూ ఆధార్ అప్‌డేట్ జరుగుతూనే ఉంటుంది. ప్రజలందరు తమ పరిధిలో ఉన్న సచివాలయాలకు ఎప్పుడు వెళ్లినా ఆధార్ అప్‌డేట్ చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలి.

– రామాంజనేయులు, వెలంపేట సచివాలయం అడ్మిన్, 35వ వార్డు.

సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే వాసుపల్లి



కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌కు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను పరిచయం చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

మన్యం పార్వతీపురం జిల్లా చినమేడపల్లి గ్రామంలో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ శంకుస్థాపనకు హాజరయ్యేందుకు శుక్రవారం ఉదయం విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కలిసి స్వాగతం పలికారు.

అవార్డు గ్రహీతలకు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అభినందనలు

మహారాణిపేట : 69వ జాతీయ చలన చిత్ర పురస్కారాల జాబితాను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, అల్లు అర్జున్ జాతీయ ఉత్తమ నటుడిగా ఎంపిక కావడం పట్ల వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అభినందనలు తెలియజేసినట్టు సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ఒక తెలుగు నటుడికి జాతీయ అవార్డు రావడం ఇదే మొదటి సారి అన్నారు. అలాగే ఒక తెలుగు సినిమాకు 11 అవార్డులు రావడం కూడా ఇదే మొదటి సారి అన్నారు. ఇందులో ఆర్‌ఆర్‌ఆర్‌కు 6 అవార్డులు, పుష్పకు రెండు అవార్డులు రావడం సంతోషకరమన్నారు. జాతీయ అవార్డులు పొందిన చిత్రాలతో త్వరలో ప్రభుత్వ ఫిల్మ్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ సహకారంతో విశాఖలో చలన చిత్ర ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామని నరవ ప్రకాశరావు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం అచ్చియ్యమ్మపేట, వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించిన ప్రజా దర్బార్‌కు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా కొబ్బరితోటలో సొంత స్థలం ఉన్న వారు తమకు బీఎస్‌సీలో ఇళ్లు మంజూరు చేయాలని కోరిన మేరకు హౌసింగ్ బోర్డు అధికారులతో మాట్లాడి ఆ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కోరారు. అదే విధంగా ఇళ్లు, కొత్త పెన్షన్లు మంజూరు చేయించాలని పలువురు ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. ఈ మేరకు ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కారం అయిన లబ్ధిదారులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆయనతో పాటు జేసీజే ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, వార్డు సీనియర్ నాయకులు లింగం శ్రీనివాసరావు, లండా రమణ, దూడ అప్పారావు, వాసుపల్లి నారాయణరావు, తాతబ్బాయి, బొడ్డేటి కిషోర్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రైడేతో దోమల నిర్మూలన



వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న జీవీఎంసీ అధికారులు



నీటిలో దోమల లార్వాలు చూపిస్తున్న మలేరియా సిబ్బంది

జగదాంబ : వారంలో ఒకరోజు డ్రైడే పాటించటం ద్వారా దోమలను నిర్మూలించవచ్చని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో సత్యనారాయణ అన్నారు. 39వ వార్డు థాంప్సన్ వీధిలో నిర్వహించిన అవగాహన ర్యాలీ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా ప్రబలకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇళ్లలోని నీటి కుండీలను పరిశుభ్రం చేసుకోవాలన్నారు. ఫ్రిజ్‌ల వెనుక ఉన్న నీటిని కూడా శుభ్రం చేసుకోవాలన్నారు. దోమతెరల ఉపయోగం వల్ల వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. పాతటైర్లు, తాగి పడేసిన కొబ్బరిబొండాలు ఇంటి పరిసరాల్లో లేకుండా చూసుకోవాలన్నారు. నిల్వ నీటిలో లార్వా ఉత్పత్తిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్, శానిటరీ సెక్రటరీలు, మలేరియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు



మూడుగుళ్లు కనకదుర్గమ్మ అమ్మవారు

అల్లిపురం : శ్రావణ మాసం రెండవ శనివారం, వరలక్ష్మీ వ్రతం సందర్భంగా నియోజకవర్గంలో అమ్మవారి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవార్లకు తెల్లవారు జాము నుంచే భక్తులు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల అర్చకులు అమ్మవార్లకు విశేష అభిషేకాలు చేపట్టారు. అస్సాంగార్డెన్స్, శ్రీ నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవాలయం, మూడుగుళ్ల కనకదుర్గమ్మ ఆలయం, వేంకటేశ్వరమెట్ట శ్రీ అలమేలు మంగమ్మ ఆలయం, టూటౌన్ దరి శ్రీ రాజశ్యామలాదేవి ఆలయం, కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల రేణుక యల్లమ్మ అమ్మవారి దేవాలయం, జెండా చెట్టు వీధి విజయ దుర్గాలమ్మ అమ్మవారి దేవాలయాల్లో విశేష పూజలు, అర్చనలు చేపట్టారు. ప్రతి ఇంట్లో మహిళలు అమ్మవారిని వారి శక్తి కొద్దీ అలంకరించి పిండి వంటలు వండి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించుకున్నారు. మహిళలకు వాయినాలు ఇస్తూ ప్రతి ఇల్లు సందడిగా మారింది.



విజేతలకు వెండి ప్రతిమలు బహూకరిస్తున్న దేవస్థానం ఈవో శిరీష

వెలంపేట దుర్గాలమ్మ ఆలయంలో అన్నదానం..

జగదాంబ : వెలంపేట శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి దేవాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, దాత ధవళ గాయిత్రి సత్యనారాయణమూర్తి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేవాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ నాయని మల్లిబాబు, ధర్మకర్తలు బత్తి మంగరాజు, చిన్ని, కండిపిల్లి వరలక్ష్మి, వెంకటలక్ష్మి, రూపవతి, డాక్టర్ స్మృతి, కౌషిక్‌బాబు, జీవన్‌బాబు తదితరులు పాల్గొన్నారు. హానిమాన్ హోమియో హాల్, ధవళ మెడికల్స్ సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.



దుర్గాలమ్మ దేవాలయంలో అన్నదానం చేస్తున్న డాక్టర్ సత్యనారాయణమూర్తి తదితరులు

లక్ష్మీదేవి వెండి ప్రతిమల బహూకరణ

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్న ఇద్దరు భక్తులకు లక్ష్మీదేవి వెండి ప్రతిమలు లక్కీ డ్రా తీసి ఈవో కె. శిరీష చేతుల మీదుగా అందజేశారు. ఆలయ మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు (తాతాజీ) సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



నీలమ్మ వేపచెట్టు అమ్మవారు



బంగారమ్మ

భక్తులకు చీర, జాకెట్టు పంపిణీ

డాబాగార్డెన్స్ : వరలక్ష్మీ వ్రతం సందర్భంగా 29వ వార్డు దిబ్బలపాలెం రామాలయం వీధిలో నిర్వహించిన శ్రావణలక్ష్మీ పూజలో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ అధ్యక్షుడు చందక అప్పలరాజు, శ్రీదేవి దంపతులు చీర, జాకెట్టు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో సహస్ర కుంకుమార్చన, లక్ష్మీ గణపతి నవగ్రహ హోమం నిర్వహించారు.

ఎండా.. వానల నుంచి రక్షణగా..



ఆదర్శమూర్తులకు గొడుగుల ఏర్పాటు



గొడుగులు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

- తీరం చెంతన మహనీయుల విగ్రహాలకు గొడుగుల ఏర్పాటు
- రాత్రి వేళ కనువిందు చేసేలా విద్యుత్ వెలుగులు
- పనులు పూర్తి చేసిన విశాఖ పోర్టు ట్రస్ట్



విద్యుత్ వెలుగుల్లో మహనీయుడు

బీచ్ రోడ్డు: దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన యోధులు, సమాజాభివృద్ధికి శ్రమించిన మానవతావాదులు, పలు రంగాల్లో విశేష సేవలందించిన ఆదర్శప్రియులు, రాజకీయవేత్తలు ఇలా ఎంతో మంది మహనీయుల విగ్రహాలు సాగర తీరాన కొలువుదీరి ఉన్నాయి. విగ్రహాలను అయితే ఏర్పాటు చేశారు కానీ.. వాటి రక్షణ, పరిశుభ్రత, విద్యుత్ వెలుగుల విషయాన్ని మాత్రం గాలికి వదిలేశారు. ఇప్పుడు విశాఖ పోర్టు ట్రస్ట్ ఆదర్శమూర్తులకు అండగా నిలిచింది. విగ్రహాలకు గొడుగులు, లైటింగ్స్ ఏర్పాటు చేసి సందర్శకులతో అభినందనలు అందుకుంటోంది. తీరం చెంతన కొలువుదీరిన మహనీయుల విగ్రహాలు సరికొత్తగా దర్శనమిస్తున్నాయి. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ పాడైపోతున్న విగ్రహాల రక్షణకు పోర్టు ట్రస్ట్ అధికారులు చర్యలు చేపట్టారు.

అపరిశుభ్రత నుంచి విముక్తి

సాగరతీరంలో ఏర్పాటు చేసిన విగ్రహాలకు ఎటువంటి నీడ, రక్షణ గోడ లేదు. దీంతో విగ్రహాలపై పక్షులు వాలి పాడు చేస్తున్నాయి. అవి కళావిహీనంగా దర్శనమివ్వడంతో సందర్శకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విగ్రహాలను చూసేందుకు ఆసక్తి కూడా చూపడం లేదు. మహనీయుల జయంతి, వర్ధంతి రోజుల్లో నివాళులర్పించే సమయంలో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలకు పోర్టు ట్రస్ట్ అధికారులు పరిష్కారం చూపుతూ విగ్రహాలకు రక్షణ చర్యలు చేపట్టారు. తీరంలో ఉన్న అన్ని విగ్రహాలకు గొడుగులు ఏర్పాటు చేశారు. దీంతో ఆదర్శమూర్తులకు నీడతో పాటు, పక్షుల బెడద నుంచి విముక్తి కలిగింది. విగ్రహాలు చూడడానికి చాలా పరిశుభ్రంగా కనిపిస్తున్నాయి.

విద్యుత్ కాంతుల్లో మహనీయులు

సందర్శకులకు మహనీయుల కోసం తెలియాలని విగ్రహాలను ఏర్పాటు చేశారు. అయితే తీరానికి సందర్శకులు ఎక్కువగా సాయంత్రం, రాత్రి సమయంలో వస్తారు. తీరంలో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద విద్యుత్ వెలుగులు లేకపోవడంతో అటు వైపు వెళ్లేందుకు సందర్శకులు ఆసక్తి చూపడం లేదు. ఇప్పుడు మహనీయుల విగ్రహాల వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. ముఖం కనిపించేలా ఒక లైట్, వారి వివరాలు తెలిపే పలక కనిపించేలా ఒక లైట్‌ను ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో కూడా ఆదర్శమూర్తుల కోసం తెలుసుకునే అవకాశం కలిగిందని సందర్శకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అధునాతన ఔషధాలతో క్యాన్సర్ నివారణ



డాక్టర్ మాధవిని సన్మానిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట : క్యాన్సర్ వ్యాధి నివారణకు అధునాతన పద్ధతులు, ఔషధాలు వచ్చాయని అమెరికాలో స్థిరపడ్డ ఆంధ్ర వైద్య కళాశాల పూర్వ విద్యార్థిని, ప్రముఖ మెడికల్ అంకాలజిస్టు డాక్టర్ గౌరుసు మాధవి అన్నారు. శుక్రవారం ఆంధ్ర వైద్య కళాశాల అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కామన్ టీచింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా 'ప్రివెన్షిన్ మెడిసిన్–అంకాలజీ' అన్న అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. ఆహారపు అలవాట్లు, ఇతర కారణాల వల్ల ప్రపంచంలో క్యాన్సస్ వ్యాధి పెరుగుతోందని అన్నారు. మద్యం, ధూమపానం, వంశపారంపర్యంగా ఈ వ్యాధి సోకుతోందన్నారు. తొలి దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే పూర్తిగా నియంత్రించవచ్చన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ మన్మథరావు, ఏఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కేఏవీ సుబ్రహ్మణ్యం, కేజీహెచ్ మెడికల్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శిల్ప, డాక్టర్ పీఎస్ఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ మాధవిని ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

నేత్రదానంపై అవగాహన అవసరం

ఆరిలోవ: ప్రజలు నేత్రదానంపై అవగాహన కలిగి ఉండాలని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్య నిపుణుడు డాక్టర్ రోహిత్ దురేజా తెలిపారు. 38వ నేత్రదాన పక్షోత్సవం శుక్రవారం హనుమంతవాక వద్ద ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో నిర్వహించారు. సెప్టెంబరు 8 వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు.